# ప్రాప్తం

"నేనీ పెళ్లి చేసుకోను!"

హాల్లో ఉన్న ముగ్గురూ ఒక్కసారిగా ఉలిక్కిపడి కౌసల్య వైపు చూశారు.

"వెంటనే వాళ్ళకి ఉత్తరం రాసి పారేయండి..." అంటూ చేతిలో పుస్తకాలు టేబిల్ మీదకు విసిరేసి తన గదిలోకి వెళ్ళిపోయింది కౌసల్య.

ఓ మూల గోడకు జారగిలపడి, వేమన శతకంలోని పద్యాలు బట్టీ పడుతున్న ఆరేళ్ళ బాబిగాడు అక్కవైపు దిగులుగా చూశాడు. అక్కపెళ్ళికి నాన్నగారు తనకు సఫారీ సూట్ కుట్టిస్తానన్నారు. ఆ ఛాన్సు పోతుందేమోనన్న ఆలోచన రాగానే వాడి కళ్లలో దిగులు కమ్మేసింది.

ఒకవైపు పెళ్లికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోతూంటే - ఇప్పుడిలా హఠాత్తుగా, అర్ధంతరంగా కౌసల్య "ఈ పెళ్లి చేసుకోను" - అని ఎందుకన్నదో అర్ధంకాక, అర్జునరావుగారూ, అనసూయా ఒకరి ముఖాలోకరు చూసుకున్నారు.

కౌసల్య ఎంతో అందంగా వుంటుంది. బి.ఏ.ఫైనలియర్ చదువుతోంది. ఇంక పది రోజుల్లో పరీక్షలయిపోతాయి. ఆ తర్వాత పది రోజులకు పెళ్ళి ముహూర్తం! పెళ్ళికొడుకు ప్రసాదరావు కూడా మాంచి అందగాడు! అనకాపల్లి స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసరు! కట్నం లేకుండా కౌసల్యను చేసుకునేందుకు ఒప్పుకున్నాడు. తన కూతురికి అంత మంచి సంబంధం దొరికినందుకు అర్జునరావుగారూ అనసూయా ఆనందంతో వుక్కిరిబిక్కిరైపోతున్నారు. 'అమ్మాయి అదృష్టవంతురాలు' అని నిద్దట్లో కూడా పలవరిస్తున్నారు.

పెళ్ళిపనుల్లో సాయం చేయటానికి - బరంపురంలో ఉన్న తన చెల్లెల్ని ఉన్న పళంగా రమ్మని అంతకుముందు రోజే ఉత్తరం రాయించింది అనసూయ. రేపో మాపో ప్రెస్సుకి వెళ్ళి శుభలేఖలు ప్రింటింగుకి ఇవ్వాలనుకుంటున్నారు అర్జునరావుగారు.

ఇంత జరిగాక, తెరమీద కథ క్లయిమాక్సులో వుండగా కరెంటు పోయినట్లు, కౌసల్య ఈ పెళ్ళి చేసుకోనంటుందేమిటీ?

"అసలేం జరిగిందో కనుక్కో!" ఆడపిల్లకి తల్లి దగ్గర చనువు జాస్తిగా వుంటుంది. కనక అసలు విషయం ఏమిటో ఆరా తీయమని భార్యని ఆదేశించారు అర్జునరావుగారు.

అనసూయకి తప్పలేదు. నెమ్మదిగా కూతురు గదిలోకి అడుగు పెట్టింది.

మోచేతులు కళ్ళకు అడ్డం పెట్టుకుని మడత మంచం మీద వెల్లకిలా పడుకుంది కౌసల్య.

"అసలేం జరిగిందే! ఎందుకు చేసుకోవూ పెళ్ళి!" - గోడవారనున్న కర్ర కుర్చీని మంచం దగ్గరకు లాక్కుని, కూర్చున్న తరువాత అడిగింది అనసూయ.

వెంటనే బదులివ్వలేదు కౌసల్య.

"అబ్బాయి నచ్చాడన్నావ్ కదటే?"

అడిగిన ప్రశ్న వేరయినా, కూతురు నుంచి అనసూయ ఆశించిన సమాధానం ఒక్కటే. దానికోసమే ఆత్రంగా చూసింది.

"అబ్బాయి నచ్చేడు. అతని అలవాట్లే నచ్చలేదు" లేచి కూర్చుని చెప్పింది కౌసల్య.

"అంటే?"

"అతను తాగుతాట్ట!"

ఆ సమాధానం వినగానే క్షణకాలం దిగ్భ్రాంతి కలిగినా - ఆ వెంటనే అనసూయ మనసు తేలికపడింది.

"ఓస్ ఇంతేకదా! అయినా ఈ రోజుల్లో తాగుడు కూడా ఫేషనయిపోతోందట. ఈ మాత్రం దానికి బంగారం లాంటి సంబంధాన్ని ఒదులుకుంటామా? పైగా నువ్వంటే ఇష్టపడి కట్నం లేకుండా చేసుకుంటున్నాడు. నీ మాటవిని రేపు ఆ తాగుడు మానకపోడు!" అంది.

"నీకు తెలీదమ్మా! తాగుడు అలవాటైతే - పెళ్ళాం మెడలో పుస్తెలు కూడా అమ్ముకుంటారు. అవసరమైతే కట్టుకున్న పెళ్ళాన్నైనా వదిలేస్తారుగానీ ఆ అలవాటు వదులుకోలేరు. నాకు తెలుసు" - వాదించింది కౌసల్య.

అలాంటి ఖచ్చితమైన అభిప్రాయం ఆమెలో ఎందుకు స్థిరపడిపోయిందో అనసూయ ఊహించుకోగలదు.

మూడేళ్ళ క్రితం -

అర్జునరావుగారు మహారాణిపేటలో వున్న ఓ మేడ పై భాగంలో అద్దెకుండేవారు. కింది వాటాలో హనుమంతరావని ఓ కుర్రాడుండేవాడు. అతనికి షిప్‌యార్డులో పని. అతని భార్య వసుంధర చాలా అమాయకంగానూ ఎంతో అందంగానూ ఉండేది. ఆమెదీ, కౌసల్యదీ ఇంచుమించు ఒకే వయసు కావటం వల్ల ఇద్దరి మధ్యా స్నేహం పెరిగింది. ఒకర్ని చూడకుండా మరొకరు ఒక్కరోజు కూడా వుండలేకపోయేవారు. ప్రతిరోజూ సాయంత్రం బాల్కనీలో కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు.

హనుమంతరావు రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. అప్పుడప్పుడు భార్యతో ఎందుకో ఘర్షణ పడేవాడు. ఆ ఘర్షణలో ఆమెపై అతను చేయి చేసుకోవటం కూడా కౌసల్య గమనించకపోలేదు.

ఓ రోజు సాయంత్రం, తమ మాటల మధ్యలో ఆ ప్రస్తావన తెచ్చింది కౌసల్య -

"మీ సంసార విషయాలు అడుగుతున్నానని ఏమీ అనుకోకు! కానీ అతను నిన్ను అలా హింసిస్తుంటే - నువ్వెలా భరిస్తున్నావో, ఎందుకు సహిస్తున్నావో అర్థం కావటం లేదు'' అన్నది.

"ఏం చేయమంటావోయ్. మనం ఆడవాళ్ళం! అంటే అణిగి మణిగి ఉండవలసిన వాళ్ళం. స్వతహాగా ఆయన మంచివారే! తాగినప్పుడే అలా ప్రవర్తిస్తారు."

"మీ ఆయన తాగుతాడా?" - నివ్వెరబోతూ అడిగింది కౌసల్య.

"అప్పుడప్పుడు. అలా తాగినప్పుడు ఆయన మనిషి కాదనుకో! పశువులా ప్రవర్తిస్తాడు. ఆ రాత్రి నాకు నరకం తప్పదు. ఆ నరకాన్ని భరించటం కంటే చనిపోవటం నయమనిపిస్తుంది!'' - తలవంచుకొని చెప్పింది వసుంధర.

జాలిగా చూసింది కౌసల్య. ఆ తర్వాత కొన్ని నెలలకే వసుంధర చచ్చిపోయింది. వంటింట్లో స్టవ్ వెలిగిస్తుంటే ప్రమాదవశాత్తూ చీరకు మంట అంటుకుని చనిపోయిందని పోలీసులకు చెప్పుకున్నాడు ఆమె భర్త. కానీ వసుంధర ఆత్మహత్య చేసుకుందని కౌసల్యతోబాటు చుట్టు పక్కల వాళ్ళు చాలా మంది అనుకున్నారు. ఆ సంఘటనే కౌసల్యను మానసికంగా కృంగదీసింది. ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చేయటానికి శతవిధాల ప్రయత్నించారు అర్జునరావుగారు. అక్కడినుంచి మరో ఇంటికి మకాం మార్చారు.

గాయం మానినా మచ్చ మిగిలిపోయినట్లు, ఆనాటి సంఘటన కౌసల్యలో బలవత్తరమైన ప్రభావాన్ని మిగిల్చిపోయిందని అనసూయకు తెలుసు.

"అసలింతకీ పెళ్ళికొడుకు తాగుతాడని నీకెలా తెలుసూ?" - కూతుర్ని ఎలా అయినా తనవైపు తిప్పుకోవాలనే ప్రయత్నంలో అడిగింది.

"ఎలా తెలుసా? ఉండు చెప్తాను'' - అంటూ గబగబా హాల్లోకి వచ్చి టేబుల్ మీద వున్న ఓ పుస్తకంలోంచి ఇన్‌లాండ్ కవరు తీసి -

"ఇది చదువు, తెలుస్తుంది" - అంటూ దానిని విసురుగా తల్లిచేతికి అందించింది.

ఆత్రంగా కవరు విప్పి చదవింది అనసూయ.

"..... డియర్ కౌసల్యా,

నీ ఉత్తరం చేరింది. నువ్వు సేకరించమన్న వివరాలన్నీ సేకరించాను. నిన్ను

చూసుకున్న ప్రసాదరావు ఇక్కడి స్టేట్‌బ్యాంకులో పనిచేస్తున్న మాట యాదార్థమే... మావారూ ప్రసాదరావూ పక్కపక్కనే కూర్చుంటారట!... అతనికి ఆస్థిపాస్తులు బాగానే వున్నాయి. అతనికి ఓ బామ్మవుంది... ఆవిడపోతే లక్ష రూపాయల ఆస్తి ఇతగాడికి వస్తుంది... "ఎపుడు పోతుందా?" - అని ఎదురుచూస్తున్నాడు... పోతే, చెడ్డ అలవాట్లు ఏవైనా వున్నాయేమో తెలుసుకొమ్మని రాశావు... 'బ్రహ్మచారి కదా, బాదరబందీలు ఏమీలేవు... అందుకే వచ్చిన సినీమానల్లా చూస్తాడు... కాఫీ, సిగరెట్లు తాగుతాడు... అపుడపుడు మందుకొడతాడు! అని మావారు చెప్పేరు... మందు పార్టీలకు మావారూ వెడతారటలే. కానీ కంపెనీ కోసం వాళ్ళతో కూర్చుని ఉత్తినే కోకోకోలా తాగి చికెన్ తింటారట... ఇప్పటిదాకా నేను నమ్ముతున్నానుకో... అదీ విషయం!... ఏది ఏమైనా చాలా మంచి సంబంధం... తొందరగా అతని చేత తాళి కట్టించుకుని హాయిగా అనకాపల్లి వచ్చేయ్... ఈ లోగా మా వీధిలోనే మంచి ఇల్లు చూసిపెడతాను... మీ అమ్మగారికీ నాన్నగారికీ నమస్కారములు చెప్పు!... ఉంటాను!..

.... నీ ఉష"

ఉత్తరం చదివిన అనసూయకు అసలు విషయం బోధపడింది.

"అయితే పెళ్ళికొడుకు గురించి వాకబు చేయమని ఉషకి రాశావన్నమాట!" అడిగింది కవరు మడిచేస్తూ.

"అవును... రాస్తే తప్పా?... జీవితాంతం అతనితో గడపవలసినదాన్ని. అతని గురించీ అతని వ్యక్తిత్వం గురించీ తెలుసుకోవటంలో తప్పులేదుగా!... అదృష్టవశాత్తూ ఉష మొగుడు కూడా ఆ బ్యాంకులోనే పనిచేస్తున్నాడు కనక - అసలు విషయం బయటపడింది... లేకపోతే అతనితో నా పెళ్ళి జరిగిపోయేది. ఆ తర్వాత కొన్నాళ్ళకి నేను కూడా వసుంధరలాగే ఒళ్ళుకాల్చుకుని చచ్చేదాన్ని!"

ఆ మాట వినగానే అనసూయ మనసు చివుక్కుమంది... కూతురు పట్టుదల ఎలాంటిదో ఆమెకు బాగా తెలుసు. ఏదైనా ఒక నిర్ణయాన్ని తీసుకుంటే దాన్ని మార్చడం చాలా కష్టమనీ తెలుసు... అందుకే అనసూయ మౌనంగా ఉండిపోయింది.

అర్జునరావుగారు మాత్రం ఆ రాత్రి డైనింగు టేబులు దగ్గర మళ్ళీ మరోసారి, కూతురికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.

"అంతగా కావాలంటే ఓ కుంటివాణ్ణో, గుడ్డివాణ్ణో తీసుకురండి, చేసుకుంటాను. అంతేగానీ, తాగుబోతును మాత్రం నాకు కట్టబెట్టకండి!" - ఆవేశంగా చెప్పింది కౌసల్య.

అర్జునరావుగారు మరేం మాట్లాడలేకపోయారు... మార్నాడే మగపెళ్ళివారికి ఉత్తరం రాసేశారు.

"జాతకాలు కలవలేదనే విషయం చివరి నిమిషంలో తెలిసిందనీ, అందువల్ల తమ నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చినందుకు క్షమించమనీ" - ఆ ఉత్తరంలో వేడుకున్నారు.

అక్కడితో కథ మొదటికొచ్చింది.

అర్జునరావుగారు పెళ్ళికొడుకుల వేట మళ్లీ ప్రారంభించారు. నెలరోజుల వ్యవధిలో మూడు సంబంధాలు తీసుకొచ్చారు. అందులో హైదరాబాదు సంబంధం అర్జునరావుగారికీ, అనసూయకీ బాగా నచ్చింది. అబ్బాయి పేరు రామారావు... అతనూ కట్నం లేకుండానే కౌసల్యను చేసుకుంటానన్నాడు..

అయితే కౌసల్య వెంటనే ఒప్పేసుకోలేదు.

"మిమ్మల్ని ఓ విషయం అడగాలి" అన్నది, పెళ్ళిచూపుల కొచ్చిన రామారావుతో.

"వెల్‌కం!" అన్నాడు రామారావు.

క్షణంపాటు తటపటాయించిన తర్వాత చెప్పింది -

"మరేంలేదు... తాగేవాళ్ళంటే నాకు అసహ్యం... ఒకవేళ మీకు అలాంటి అలవాటేమైనా..."

కౌసల్యను పూర్తిగా చెప్పనివ్వలేదు రామారావు.

"నో! కనీసం సోడా తాగే అలవాటు కూడా నాకు లేదు" ! - అన్నాడు

"చూడమ్మా! మావాడు సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే!... ఇంత సంపాదించు కుంటున్నా ఇప్పటికీ ఇంగ్లీషు సినిమాలు చూడాలంటే మా పర్మిషన్ తీసుకుని గానీ వెళ్ళడు!" - రామారావు తండ్రి సగర్వంగా చెప్పేడు...

కౌసల్య తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

తనకు కాబోయే భర్త తల్లిదండ్రుల చాటు బిడ్డయినా ఫరవాలేదు... కానీ తాగుబోతు మాత్రం కాకూడదు...

అందుకే రామారావు తనకు నచ్చేడు...

అర్జునరావుగారు ఆలస్యం చెయ్యలేదు. వెంటనే ముహూర్తం పెట్టించి శుభలేఖలు ప్రింటు చేయించారు.

పెళ్ళి వైభవంగా జరిగిపోయింది...

ఆ తర్వాత వారం రోజులకి ఉష దగ్గర్నుంచి ఉత్తరం అందుకుంది కౌసల్య.

".... ప్రసాదుకీ నీకు పెళ్ళవుతుందనీ ... ఎంచక్కా నువ్ కూడా మా అనకాపల్లి వచ్చేస్తావనీ బోలెడంత ఆశపడ్డాను. కానీ జాతకాలు కలవకపోవటం వల్ల చివరి నిమిషంలో మీ నిర్ణయం మార్చుకున్నట్టు ప్రసాదే చెప్పాడు... ఏం చేస్తాం? అన్నీ మన మంచికేనని సరిపెట్టుకోవాలి.... నీ పెళ్ళికి రావాలని ఎంతో ఉబలాటపడ్డాను. కానీ అదే ముహూర్తానికి

ప్రసాద్ పెళ్ళికూడా నిశ్చయమైంది. ఇంతకీ వధువెవరో తెలుసా? మా పిన్నత్తగారి కూతురే!... నళిని!... ఓసారి మాతో విశాఖపట్నం వచ్చినప్పుడు నువ్వు చూశావ్... గుర్తుందా?.... అఫ్‌కోర్స్! నీ అంత బ్యూటీ కాదనుకో... అయినా 'మేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్' కదా?.... ఎవరికెక్కడ ప్రాప్తమో చెప్పలేం! వదిలెయ్! నువ్ హైదరాబాద్ కాపురానికి వెళ్ళిపోయేలోగా ఓసారి మా అనకాపల్లి వస్తే సంతోషిస్తాను...." - అంటూ రాసింది ఉష.

"పాపం.. నళిని! పూర్ గర్ల్! వసుంధరలాగే ఎప్పుడో ఒక రోజున ఆత్మహత్య చేసుకుంటుందేమో!" అనుకుంది కౌసల్య.

★ ★ ★

హైదరాబాద్ కాపురానికి వెళ్ళిన తరవాత కౌసల్యకి ఆర్నెల్లు ఇట్టే గడిచిపోయాయి.

శాంతినగర్‌లో అందమైన ఇల్లు... ఆ ఇంట్లో చిలకాగోరింకల్లా తనూ తన భర్త!... తమ అలనాపాలనా చూసేందుకు పార్వతీపరమేశ్వరుల్లా అత్తగారూ మావగారూ....

ఎప్పుడైనా కౌసల్య ముచ్చటపడి వంట చేస్తానన్నా - అత్తగారు ఒప్పుకునేదికాదు.

"నా ఒంట్లో ఓపికున్నంత వరకూ నువ్ వంట చెయ్యవలసిన అవసరం రాదులే తల్లీ" - అనేది ఆప్యాయంగా.

పగలంతా పుస్తకాలు చదువుకుంటూ గడిపేసేది కౌసల్య. సాయంత్రం భర్త ఆఫీసు నించి ఇంటికొచ్చింతర్వాత, స్కూటరు మీద అతనితో మళ్ళీ షికార్లు... ఓ రోజు సినిమా, ఇంకో రోజు రవీంద్రభారతిలో కల్చరల్ ప్రోగ్రాం... మరో రోజు ఫ్రెండింట్లో డిన్నరు.

అలా ఆర్నెల్లు ఆరురోజులుగా గడిచిపోయాయి.

అంతలోనే రామారావ్‌కి ఢిల్లీ ట్రాన్స్‌ఫరయింది... శ్రావ్యమైన సంగీతం వింటూండగా మధ్యలో అపశృతి విన్నట్లయింది కౌసల్యకి. హాయిగా స్వంత ఇంట్లో అత్తమామల నీడన ఈ ఆర్నెల్లూ సుఖంగా వున్నది. ఇప్పుడు ఢిల్లీ అనగానే మళ్ళీ అక్కడ అద్దె ఇల్లు... కొత్త మనుష్యుల మధ్య ఒంటరితనం...!

అయినా వెళ్ళక తప్పదు... ప్రమోషను మీద ట్రాన్స్‌ఫరు మరి! ఢిల్లీ వెళ్ళి త్వరలోనే మంచి ఇల్లు చూసి ఉత్తరం రాస్తాననీ అప్పుడు బయల్దేరి రమ్మనీ, కౌసల్యకు చెప్పి రామారావు ఢిల్లీ బయల్దేరాడు.

ఈలోగా తాను పుట్టింట్లో వుండి వస్తానని కౌసల్య కూడా విశాఖపట్నం ప్రయాణమైంది.

రెండు నెలలు గడిచిపోయాయి...

రామారావు దగ్గరి నుండి కౌసల్య ఉత్తరం అందుకుంది... జనకపురిలో మంచి

ఇల్లు అద్దెకు దొరికిందనీ - ఆ చుట్టుపక్కల తెలుగువాళ్లు కూడా చాలామంది వున్నారనీ వెంటనే బయల్దేరి ఢిల్లీ వచ్చేయమనీ రాశాడు.

అర్జునరావుగారు కూతురి ఢిల్లీ ప్రయాణానికి రిజర్వేషను చేయించారు... ముందు బెజవాడ వెళ్ళి, అక్కడ ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి! పది రోజుల్లో ప్రయాణం!

ఇంతలో ఉషను ఓసారి చూడాలనిపించింది కౌసల్యకి. అసలు హైదరాబాదు కాపురానికి వెళ్ళేముందే తనను రమ్మని ఆహ్వానించింది. కానీ అవకాశం దొరకలేదు... ఇప్పుడు ఢిల్లీ వెళ్ళిపోతే, మళ్లీ తొందరలో అటు రావటానికి వీలుపడకపోవచ్చు.

అందుకే ఓసారి వీలుచేసుకొని ఉషను చూట్టానికి అనకాపల్లి బయల్దేరింది కౌసల్య.

స్నేహితురాల్ని సాదరంగా ఆహ్వానించింది ఉష.

"మీ పిన్నత్తగారమ్మాయి నళిని కులాసాగా వుంటోందా?" ఆ రాత్రి డాబా మీద కూర్చున్నప్పుడు, కబుర్ల మధ్య యదాలాపంగా అడిగింది కౌసల్య.

"హాయిగా వుంటోంది" చెప్పింది ఉష.

కౌసల్యకు ఆ సమాధానం రుచించలేదు. నళిని భర్త ప్రసాదరావు తాగుడికి బానిసైపోయాడనీ అతనితో ప్రతిరోజూ నళిని నరకమే అనుభవిస్తోందనీ ఉష చెబుతుందని ఆశించింది.

ఏమో? ఉషకి కూడా తెలియదేమో? ఆనాటి వసుంధరలాగే నళిని కూడా సర్దుకుపోయే అర్ధాంగి కావచ్చు. ఇంటిగుట్టు రచ్చకీడ్చే మనస్తత్వం కాకపోవచ్చు... అయినా తాను ఒక్కసారి చూస్తే నళిని హాయిగా కాపురం చేస్తోందో భర్త వ్యసనాలతో నరకాన్నే చవి చూస్తోందో అర్థం చేసుకోగలదు.

"రేపోసారి నళిని వాళ్ళింటికి వెడదామా" అడిగింది కౌసల్య.

"అలాగే తప్పకుండా వెడదాం... ఈ మధ్యే వాళ్లు ఇల్లు కొనుక్కుని గృహప్రవేశం చేసుకున్నారు. నువ్వు కూడా చూద్దువుగాని" చెప్పింది ఉష.

కౌసల్యకి మరి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు నళిని కాపురం చూస్తానా - అని అర్థం కాని ఆతృతతో ఆ రాత్రి గడిపేసింది.

మర్నాడు సాయంత్రం ఇద్దరూ కలిసి నళిని ఇంటికి వెళ్లేరు.

అందమైన డాబా ఇల్లు. ఇంటి ముందు చక్కని పూల తోట. అందులో రకరకాల గులాబీ మొక్కలు.

"ఈ ఇంటిని ఈ మధ్యనే కొన్నారు.. అరవైవేలు" తోట దాటి లోపలకు నడుస్తూ చెప్పింది ఉష.

'ఇంటి యజమాని తాగుబోతయిన తర్వాత ఇల్లు ఎంత ఖరీదైనదైతే మాత్రం ఏమిటి ప్రయోజనం?'' అనుకుంది కౌసల్య మనసులోనే.

లోపలకు అడుగు పెట్టేసరికి నళిని చిరునవ్వుతో ఎదురైంది. కౌసల్యనీ ఉషనీ ఉత్సాహంగా పలకరించింది.

"మా ఉష ఒదిన అస్తమానూ మీ గురించి చెబుతూనే వుంటుంది. మీరు మా ఇంటికి రావటం నిజంగా మా అదృష్టం'' అంటూ సోఫా చూపించింది... కాఫీ తీసుకురమ్మని వంట గదిలో వున్న - వంట మనిషికి ఆర్డరు జారీ చేసింది.

"మావారు ముందు మిమ్మల్ని చూసుకున్నారటగా... ఉషే చెప్పింది ఓసారి. మీరు చాలా అందంగా వుంటారనీ దేవుడు మేలుచేస్తే తన పెళ్ళి మీతో జరిగేదనీ, జాతకాలు కలవకపోవటం వల్ల ఆ ఛాన్సు నేను కొట్టేశాననీ, మావారు ఇప్పటికీ అంటూంటారు'' గల గలా నవ్వుతూ చెప్పింది నళిని.

'తాగుబోతును పెళ్ళి చేసుకోవటం కూడా ఛాన్సే కాబోలు' అనుకుంది కౌసల్య.

"నిజంగా మా నళిని అదృష్టవంతురాలోయ్'' - కాఫీ తాగుతూ అంది ఉష.

"నిజమే... నేను ఇలా కాపురానికొచ్చేను. మా వారి బామ్మగారెవరో అలా బాల్చీ తన్నేశారు. అంతే.... లక్ష రూపాయల ఆస్థి వచ్చింది. అందుకే నేవొచ్చిన వేళావిశేషం గొప్పదంటారు... అరవైవేలు పెట్టి ఈ ఇల్లు కొని, దీనికి నా పేరు పెట్టేరు'' నవ్వుతూనే చెప్పింది నళిని.

ఆ నవ్వు అసహజంగా లేదు. ఆ మాట కృత్రిమంగా లేదు. ఆమె కళ్ళ వెనకాల ఎలాంటి అలసటా ఆవేదనా కనిపించలేదు. మనిషిలో ఏదో పెద్దరికం... ఎంతో హుందాతనం.. కళ్ళ మెరుపులో ఏదో గర్వం... ఓ మహాసామ్రాజ్యమే తన ఆధీనంలో వున్నంత ధైర్యం ఆమె నవ్వులోనూ చూపులోనూ మాటలోనూ కనిపించాయి.

'అయితే ప్రసాదరావ్ తాగుడు మానేశాడా' - అనుమానం కలిగింది కౌసల్యకి.

"నీకో వింత చెప్పనా?'' కాఫీ త్రాగటం పూర్తిచేసి ఓరకంట నళినివైపు చూస్తూ కౌసల్యను అడిగింది ఉష.

"ఏమిటీ''

"మా నళిని మొగుడు సిగరెట్లు కాల్చటం మానేశాడు'' - గొప్పగా చెప్పింది.

"సిగరెట్లు మానటం కూడా వింతేనా'' - అసలు విషయం బయట పడుతుందనే నమ్మకంతో అంది కౌసల్య.

దానికి సమాధానం నళినే చెప్పింది -

"వింత కాదనుకోండి! కానీ వింతగా జరిగింది. ఓసారి ఈయనగారు అదేదో తెలుగు

సినిమా చూశారట. అందులో హీరో, ఆఫీసుకు వెళ్లేటప్పుడు భార్యను ముద్దు పెట్టుకొని మరీ వెడతాడట... ఆ ముద్దు ఆ రోజంతా హీరోకి టానిక్‌లా పనిచేస్తుందట... అందుకని అప్పట్నించీ ఈయనా మొదలు పెట్టేరు... కానీ నాకేమో సిగరెట్టు వాసన పడదాయెమరి!... నా ముద్దు కావాలో - సిగరెట్టు కావాలో తేల్చుకోమన్నాను... పాపం సిగరెట్టే వదిలేశారు".

ఈసారి కౌసల్యకి నవ్వొచ్చింది.

"అంతే కాదోయ్! ఓసారి ఏదో పార్టీకి వెళ్ళి వీళ్ళ హీరో తాగొచ్చాట్ట... అప్పుడు ఈ హీరోయిన్ ఏం చేసిందో తెలుసా?" అడిగింది ఉష.

ఆసక్తిగా చూసింది కౌసల్య... ఆవిషయమే తాను తెలుసుకోవాలి!

"తలగడా దుప్పటీ తీసుకెళ్ళి వసారాలో పడుకుంది.... దాంతో అబ్బాయిగారి తల తిరిగిపోయింది... ఇంకెప్పుడూ తాగనని ప్రమాణం చేసేదాకా ఆయనగారి పక్కలోకి చేరలేదు."

"ఛీ....!" సిగ్గుపడింది నళిని.

ఆ సిగ్గులో ఘన విజయాన్ని సాధించిన గర్వమే కానీ - మరో భావం కనిపించలేదు కౌసల్యకి.

"నిజంగానే నళిని అదృష్టవంతురాలు!... వసుంధరలాగా ఆత్మహత్య చేసుకునే అవసరం నళినికి ఎపుడూ రాదు!" అనుకుంది.

'ఒకవేళ ప్రసాదరావుతోటే తన పెళ్ళి జరిగివుంటే?"

హాయిగా పుట్టింటికి దగ్గరగా వుండేది. ఆ డాబా "కాంపౌండుగోడ" మీద "నళిని" అనే పేరుకు బదులుగా "కౌసల్య" అని తన పేరు ఉండేది.

క్షణంలో ఆ ఆలోచనలు ఆమె మనసును ఆక్రమించుకున్నా అంతలోనే వివేకం హెచ్చరించింది.

'ఛీ... ఏమిటీ తన ఆలోచనలు?... తనకు మాత్రం ఇప్పుడు లోటేం వచ్చింది?... కావాలని రామారావుని పెళ్ళిచేసుకుంది. అతనూ అందగాడు. తనంటే అతనికీ ప్రేమానురాగాలన్నాయి... ఉద్యోగంలో ప్రమోషన్ కూడా వచ్చింది' అని మనసుకు నచ్చచెప్పుకుంది కౌసల్య.

★ ★ ★

న్యూఢిల్లీ స్టేషనులో రైలు దిగింది కౌసల్య.

రామారావు స్టేషనుకొచ్చేడు. కౌసల్యను చూడగానే అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి.

అరగంట తర్వాత ఆటో, జనకపురిలో ఓ ఇంటి ముందు ఆగింది.

"ఇదే మన అద్దెగృహం! కుడికాలు ముందుపెట్టు!" తలుపు తాళం తీసి లోపలకు ఆహ్వానించాడు భార్యని.

కుడికాలు లోపల పెట్టగానే - ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి నిశ్చేష్టురాలైంది కౌసల్య. ఎడమకాలు లోపలకు పూర్తిగా పడలేదు...

"అవన్నీ..." మాటలు కూడదీసుకుంటోంది.

ఎదురుగా టీపాయ్ మీద ఖాళీ అయిన విస్కీ సీసాలూ... గాజు గ్లాసులూ... పింగాణి ప్లేట్లూ....

"ఓ! సారీ! నిన్నరాత్రి ఫ్రెండ్సొస్తేనూ 'కార్డ్స్' ఆడుకున్నాం! ఇవికూడా వాళ్ళే పట్టుకొచ్చారు. నేను ఎక్కువ తాగలేదులే! వాళ్లే 'టూమచ్'గా తాగేశారు. నీకు తెలీదేమో నేనెప్పుడూ లిమిట్‌లోనే వుంటాను. అంతవరకూ ఎందుకూ? నేను తాగితే ఆ దేవుడు కూడా కనిపెట్టలేడు"- టీపాయ్ మీదనున్న గ్లాసులూ, సీసాలు, ప్లేట్లూ తీసేస్తూ - గబగబా చెబుతున్నాడు రామారావు.

కానీ ఆ మాటలన్నీ కౌసల్యకి వినిపించటం లేదు. ఆమె కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. కాళ్ళ కింద నేల కరిగిపోయి, తాను అగాధంలోకి జారిపోతున్నట్టు ఫీలవుతోంది!

(ఆంధ్రభూమి
*31-12-1981*)

★ ★ ★